క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ నూతన లైన్ ఏర్పాటు కోసం ఆర్యనగర్–1, 2, వినాయక్‌నగర్–1 ఫీడర్‌లో ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అన్నారు. పద్మానగర్, రోడ్‌నంబర్–1, హనుమాన్‌నగర్, యాదగిరి బాగ్, త్రిమూర్తి షోరూమ్ వెనక కాలనీలు, కోటగల్లి, జెండాగల్లి, నకాష్‌గల్లి, శాదుల్లా దర్గా, ఆర్యసమాజ్ రోడ్, సిర్నాపల్లి గడి, దోబీఘాట్, గోసంగి కాలనీ, శివాలయం, తెలంగాణ తల్లి విగ్రహం ఏరియా, భీమరాయ ఆలయం, వంద ఫీట్ల రోడ్, ఆకుల పాపయ్య రోడ్డు, గణేశ్ కాలనీ, అశోక్ అపార్ట్‌మెంట్, సాయికృపనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గ్రహించి సహకరించాలని ఆయన కోరారు.

నర్సింగ్‌పల్లిలో దంత వైద్యశిబిరం

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం డాక్టర్ శ్రీను నాయక్ దంత ఆస్పత్రి సహకారంతో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది గ్రామస్తులకు దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, యూనిట్ అధికారి జి సుధాకర్‌రావు, డాక్టర్ మనీషా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, వీడీసీ చైర్మన్ గంగారాం, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌నాగారం: నగరంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవన్‌లో జిల్లా మహిళా జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి సునీత కుంచాల హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశవేణు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి



నిజామాబాద్ సిటీ: భవిష్యత్తులో డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని పార్టీ నాయకులు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మానాల జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కట్‌చేసి పంచిపెట్టారు. రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వేణురాజ్, రామర్తిగోపి, రేవతి, మల్లిక, అపర్ణ, రాజనరేంద్ర గౌడ్, కేశ మహేశ్, ప్రీతం, సాయికిరణ్, హరీశ్, శివ, మాధవ్, కౌశిక్, నరందీప్, అవిన్, శోభన్, కిశోర్, శేఖర్, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పడకంటి రాముకు సన్మానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త పడకంటి రాము అమెరికా విశ్వవిద్యాలయం నుంచి సోషల్ వర్క్‌లో డాక్టరేట్ పొందడంతో పలువురు కాలనీ సభ్యులు ఆయనను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్స్ కాలనీ సభ్యులు కోటేశ్వరరావు, కిషన్ రావు, రాములు, భరణి కృష్ణ, శివ, మహేందర్, లక్ష్మణ్ నాయక్, గంగాధర్, సాయన్న, సంపత్, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



సుభాష్‌నగర్: వినియోగదారులకు వేసవిలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని, ఇందుకోసమే ఎన్పీడీసీఎల్ కంపెనీ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిందని ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ అన్నారు. నగరంలోని అర్సాపల్లి సబ్‌స్టేషన్‌లో గల డీ–6 సెక్షన్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సిబ్బంది ఇటీవల ఏర్పాటు చేశారు. మంగళవారం ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. డీఈలు శ్రీనివాస్‌రావు, వెంకటరమణ, డీఈలు ఆర్ చంద్రశేఖర్, నటరాజ్, తోట రాజశేఖర్, ప్రసాద్‌రెడ్డి, ఏఈలు నగేష్, జాకీర్ అలీ, గంగాశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- అవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీలను నిర్మించాలి
- పారిశుధ్యంలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా ఎన్‌ఎంసీని తీర్చిదిద్దాలి
- అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ



35వ డివిజన్‌లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నగరంలోని అనేక డివిజన్లలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని, అధికారులు తక్షణమే పారిశుధ్యంపై దృష్టి సారించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. మంగళవారం నగరంలోని నాందేవ్‌వాడ, హమాల్‌వాడీలోని 35, 36 డివిజన్లలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో డ్రెయినేజీ సమస్య కీలకంగా మారిందని, మున్సిపల్ సిబ్బంది నిత్యం డ్రెయినేజీల్లో పూడికలు తీయాలని సూచించారు. అవసరమైన చోట డ్రెయినేజీ కాల్వల పునఃనిర్మాణం చేపట్టాలన్నారు. రాబోయే వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరగా డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇందూరు కార్పొరేషన్‌ను పారిశుధ్యంలో రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టే విధంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నగరంలో వీధి దీపాల కొరత తీవ్రంగా ఉందని వాటిని త్వరగా ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. నాందేవ్‌వాడ, హమాల్‌వాడీ 35, 36 డివిజన్లలో ఉన్న పట్టణ ప్రకృతి వనాలు అధ్వాన స్థితిలో ఉన్నాయని, వాటిని సుందరీకరించి నగరవాసుల కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. నగరవాసులకు మౌలిక సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని కిషన్‌గంజ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. గంజ్‌లో రోడ్డు వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, గుంతలు ఏర్పడ్డాయని వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా త్వరలోనే రోడ్డు వేయిస్తామని, నీటి వసతి కూడా కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ ఈఈ మురళీ మోహన్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ జయకుమార్, డిప్యూటీ ఈఈ సుదర్శన్‌రెడ్డి, షాజిద్ అలీ, ఏఈ పావని, బీజేపీ నాయకులు ఎర్రం సుధీర్, మాస్టర్ శంకర్, నాయకులు ఉన్నారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: నగరంలోని సంజీవయ్య కాలనీలో ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 37వ డివిజన్‌లోని వివిధ కులాల ప్రతినిధులందరూ కుటుంబ సమేతంగా అమ్మవారి కల్యాణం, హోమం, నైవేద్యం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముత్యాలు, కరిపె శ్రీనివాస్, మురళి, బొట్టు వెంకటేశ్, రాజు, సహదేవ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



అమృతాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, నాయకులు

డిచ్‌పల్లి: రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని మెంట్రాజ్‌పల్లి సొసైటీ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ సూచించారు. మెంట్రాజ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో అమృతాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ బొదునం నవీన్, మాజీ వైస్ ఎంపీపీ దండుగుల సాయిలు, డైరెక్టర్ పవన్, నాయకులు నర్సయ్య, గంగాధర్‌గౌడ్, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



మల్కాపూర్(ఏ)లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- తెలంగాణను అప్పుల పాలు చేసింది మాజీ సీఎం కేసీఆర్
- కాంగ్రెస్‌తోనే ప్రజల్లో సంతోషం
- పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్: అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం రూరల్ మండలం గుండారం, మల్కాపూర్, జలాల్‌పూర్, పాల్దా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలు ముఖాల్లో సంతోషాన్ని నింపుతున్నారని అన్నారు. దేశంలో దాదాపు 15 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, ఆ రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. బీజేపీ అంటేనే భారతీయ జూటా పార్టీ అని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీలు కేంద్రం నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం మల్కాపూర్ (ఏ) గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగెట్ శేఖర్ గౌడ్, నాయకులు బాగిర్తి బాగారెడ్డి, అగ్గు భోజన్న, సింగిల్ విండో చైర్మన్లు దాసరి శ్రీధర్, కొలాస్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మోహన్, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం వంట గ్యాస్ ధరను రూ. 50 పెంచేలా తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. ఇప్పటికే పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు తగ్గిపోయి పేదరికం పెరిగిందన్నారు. పెంచుతున్న ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది వెంకట్ రాములు, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియాపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియాపై వైద్యశాఖ చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ ఆస్పత్రుల బాధితుల సంఘం నాయకుడు తిరుపతి హనుమాన్లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధితులు ఫిర్యాదులు చేస్తేనే తప్ప అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. వైద్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియా రాజ్యమేలుతోందని అన్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే టెస్టుల పేరిట ప్రజల రక్తం దాగుతున్నారన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రను తిప్పికొట్టాలి



అమృతాపూర్‌లో పాదయాత్ర చేస్తున్న నాయకులు

డిచ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని అమృతాపూర్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పాదయాత్ర చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. గాంధీ, అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. పౌరుల హక్కులను కాలరాస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రీతం, చింత శ్రీనివాస్ రెడ్డి, దండుగుల సాయిలు, ధర్మాగౌడ్, సాయిరెడ్డి, దేవకరుణ, నవీన్, నర్సయ్య, పవన్, గంగాధర్‌గౌడ్, రాజేశ్వర్, శ్రీను, భాస్కర్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



మోపాల్: మండల కేంద్రంలో గిరిరాజ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం–5 అధికారి ఎం దస్తప్ప ఆధ్వర్యంలో మంగళవారం సన్‌రైజ్ ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగింది. ప్రజలకు బీపీ, షుగర్, ఆక్సిజన్, తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా దస్తప్ప మాట్లాడుతూ.. వారం రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ప్రతిరోజు ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీడీసీ ప్రతినిధులు, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి



జీపీ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

సిరికొండ: గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేక పనులు చేయించడం లేదని, సరైన పనులు కల్పించాలని ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. సిరికొండ మండలం గడ్కోల్‌లో జీపీ కార్యాలయం ఎదుట ఉపాధి హామీ కూలీలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజుల నుంచి పనులను చూయించకపోవడంతో అటవీ ప్రాంతానికి వెళ్లి పనిలేక తిరిగి ఖాళీగా వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకలకు పాల్పడ్డారని ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించారని, కొత్త వారిని నియమించకుండా మళ్లీ అతడికే విధులు అప్పగించాలని చూస్తున్నారని వారు ఆరోపించారు. పనులు చూయించేవారు లేక మాకు ఉపాధి లభించడం లేదని వారు వాపోయారు. పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో లింబ్యా, బిక్యా, రాములు, వెంకన్న, యమున, బుజ్జి, సాయన్న, హరిదాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను కాపాడుకోవాలి



సుద్దపల్లిలో అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

డిచ్‌పల్లి: భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేయాలని, భూగర్భ జలాలను కాపాడుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 4 ప్రోగ్రాం ఆఫీసర్లు స్వప్న, స్రవంతి సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1, 4 సంయుక్త ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లిలో వేసవి ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో తిరుగుతూ భూగర్భ జలాల ప్రాముఖ్యత, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా జలసంరక్షణలో భాగం కావాలని, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. అవసరానికి మించి నీటిని దుర్వినియోగం చేయకూడదని వివరించారు. అలాగే నిజామాబాద్ సఖీ కేంద్రం ఆధ్వర్యంలో బాలలు, మహిళల సంరక్షణ, హక్కులపై అవగాహన కల్పించారు.

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

నిజామాబాద్ రూరల్: మండలంలోని ఖానాపూర్–కాలూర్‌కు వెళ్లే ప్రాంతంలో అనుమతులు లేకుండానే కొందరు రైస్‌మిల్‌ను నిర్మిస్తున్నారని దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైస్‌మిల్‌కు చెందిన బాయిలర్ బాక్స్ రోడ్డు మీదకు వచ్చిందని దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు, గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణం చేపడుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖానాపూర్, కాలూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	92,000	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	84,915	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
బీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	50	90	గోబిపువ్వు	40	60
వంకాయ	12	24	బీట్‌రూట్	20	40
పాలకూర	25	50	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్–1	ఆదిత్య–369–11.00 మ్యాడ్ స్క్వేర్–1.30, 7.30, 10.30
స్క్రీన్–2	రాబిన్‌హుడ్–1.30,7.30–శారీ–4.30 ఎల్‌వైఎఫ్–10.30 ఎల్–2 ఎంపురాన్(తెలుగు)–4.20, 10.30
స్క్రీన్–3	సికందర్(హిందీ)–11.00,1.40, 4.30, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1	సికందర్(హిందీ)–10.40, 4.35 ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ (3డీ ఇంగ్లీష్)–2.15, 8.10, 10.30
స్క్రీన్–2	ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ(3డీ ఇంగ్లీష్)–10.55 రాబిన్‌హుడ్–1.55 మ్యాడ్ స్క్వేర్–4.25, 10.10 సికందర్(హిందీ)–7.10
స్క్రీన్–3	సికందర్(హిందీ)–10.30, 1.30, 4.30, 10.35 ఎల్‌వైఎఫ్–7.30
స్క్రీన్–4	వృషభ–11.00 –శారీ–2.00 28సీ–4.50 –రాబిన్‌హుడ్–7.15 ఆదిత్య369–10.25
లలితామహల్ కోర్ట్, దేవి	రాబిన్‌హుడ్
నటరాజ్	షణ్ముఖ, విజయ్ మ్యాడ్ స్క్వేర్

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



మాట్లాడుతున్న కమిషనర్ దిలీప్ కుమార్



పాల్గొన్న మున్సిపల్ డ్రైవర్లు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహించే డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని కమిషనర్ దిలీప్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మున్సిపల్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ విభాగంలో చెత్త సేకరించే ఆటో నడిపేవారు, చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించేవారు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నిజామాబాద్ రూరల్: యువత మత్తుపదార్థాలు, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సూచించారు. జిల్లా కేంద్రంలోని జీజీ కాలేజ్‌కు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామంలో మంగళవారం గ్రామ యువత, గ్రామస్తులకు బెట్టింగ్, మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరయ్యారు. వలంటీర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సర్టిఫికెట్లను వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమములో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటరమణ, గ్రామస్తులు, వలంటీర్లు పాల్గొన్నారు.